www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 132 హైదరాబాద్ శుక్రవారం 05-09-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## హరీశ్‌రావు 108 అంబులెన్స్ లాంటి వారు..



**హైదరాబాద్ సెప్టెంబర్ 04 (సిద్దిపేట పవర్):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె సస్పెన్షన్ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చానీయంశంగా మారింది. బీఆర్ఎస్ నేతలు కవిత సస్పెండ్ అవ్వడాన్ని సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ సీనియర్ నేత దేవీ ప్రసాద్ ఈ వ్యవహారంపై స్పందించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ గీత దాటుతుందని కవితను కేసీఆర్ స్పెండ్ చేశారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ వికాసాన్ని విధ్వంసంగా చిత్రీకరిస్తున్నారని, ఈ రెండు పార్టీలు అన్ని ప్రాంతీయ పార్టీల్లో చిచ్చు పెట్టాలనుకుంటున్నాయని ఆరోపించారు. అందులో భాగంగానే బీఆర్ఎస్‌లో చిచ్చు పెడుతున్నాయని అన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరగిందని ఏజెన్సీలే తేల్చలేకపోయాయని అన్నారు. అలాంటిది అక్రమాలు జరిగాయని కవిత లాంటి వ్యక్తి తేలుస్తారా? అని ప్రశ్నించారు. హరీశ్‌రావు కేసీఆర్ సైనికుడు, శ్రామికుడని కొనియాడారు. హరీశ్‌రావు ఎలాంటి వారో అందరికీ తెలుసన్నారు. కొందరు బురద జల్లినంత మాత్రాన ఆయన ప్రతిష్ట చెరిగిపోదన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ ప్రజలకు 108 అంబులెన్స్ లాంటి వారని దేవీ ప్రసాద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

# 'మాటిస్తున్నా.. తప్పకుండా సాయం చేస్తా'

## కామారెడ్డిలో వరద బాధితులను పరామర్శించిన సీఎం

**అప్రమత్తతతో ప్రాణనష్టం తగ్గించగలిగామని సీఎం వ్యాఖ్య**

**విద్యార్థులకు పుస్తకాలు, సామాగ్రి అందించేందుకు చర్యలు**

**మరణించిన కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం.. పశుసంపదకు సాయం**



**హైదరాబాద్ సెప్టెంబర్ 04 (సిద్దిపేట పవర్):**

భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగిన చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిఅధికారులను ఆదేశించారు. వరదల వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. రోడ్లు, పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి గారు స్థానికులతో మాట్లాడారు. కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తానని మాటిచ్చారు. వరద నష్టంపై గ్రామాల వారిగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జీలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పంట నష్టానికి సహాయం అందిస్తామన్నారు.

ఇటీవలి భారీ వర్షాల కారణంగా కామారెడ్డిజిల్లాలో దెబ్బతిన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "వందేళ్లలో ఎప్పుడూ రానంత వరద వచ్చింది. నష్టపోయిన వారిని ప్రభుత్వం కచ్చితంగా ఆదుకుంటుంది. అన్ని సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో వరదల నష్టాన్ని అంచనా వేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం. రోడ్లు, ప్రాజెక్టులను మరమ్మతులు చేసేందుకు కూడా అంచనాలు రూపొందించాలి" అని అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు."వరదల వల్ల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రజలకు అండగా నిలిచారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు. ఎమ్మెల్యే లాగే కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా. వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పోచారం ప్రాజెక్టు భారీ వరదను కూడా తట్టుకుని నిలబడి అందర్నీ కాపాడింది. తాత్కాలిక మరమ్మతులు చేశాం. అయితే ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం.." అని ముఖ్యమంత్రి బాధితులకు భరోసానిచ్చారు.

మొదట తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి గారు ప్రజాప్రతినిధులతో కలిసి వరదల వల్ల దెబ్బ తిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల వల్ల లింగంపేటలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి బ్రిడ్జిని పరిశీలించారు. వరదలు వచ్చిన సందర్భంగా ఉత్పన్నమైన పరిస్థితులపై అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అక్కడ స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. పరిస్థితిని పరిశీలించిన అనంతరం తాత్కాలిక మరమ్మతులతో కాకుండా బ్రిడ్జి నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు తయారు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జి కమ్ బ్యారేజీ లేదా బ్రిడ్జి కమ్ చెక్ డ్యామ్ తరహాలో నిర్మించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి స్థాయి అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.కామారెడ్డి జీఆర్ కాలనీ సందర్శించిన సందర్భంగా బాధితులతో మాట్లాడారు. మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, పశుసంపద కోల్పోయిన వారికి సాయం అందించాలని ఆదేశించారు. "భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆస్తినష్టం జరిగినప్పటికీ అప్రమత్తంగా ఉండటం ప్రాణ నష్టం తగ్గించగలిగాం. వరదలు రాగానే క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందిగా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్కని, సలహదారు షబ్బీర్ అలీని, ఎంపీ సురేష్ షేట్కర్‌ని, ఎమ్మెల్యేలను ఆదేశించాను. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వందశాతం ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.." అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.

# అప్పుడే మొదలైంది!

**సెప్టెంబర్ నెల ప్రారంభంలోనే రూ.6 వేల కోట్ల అప్పు..**

**రాష్ట్ర ఖజానా కటకట..ఆశించిన మేర రాని ఆదాయం**

**పెరుగుతున్న ఖర్చులతో అప్పులు**

**అప్పుల మాసంగా సెప్టెంబర్.. త్వరలో మరో రూ.3 వేల కోట్లు సేకరణ?..**

**రూ.35 వేల కోట్లు దాటనున్న ఆరునెలల రుణ పద్దు**

**ఈ నెలలో అన్ని శాఖల ఉద్యోగులకు రాని వేతనాలు.. కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులు నెలాఖరులోనే**



**హైదరాబాద్ సెప్టెంబర్ 04 (సిద్దిపేట పవర్):**

రాష్ట్ర ఖజానా కటకటలాడుతోంది. ఆదాయం తక్కువై..ఖర్చులు ఎక్కువ కావడంతో అప్పులు చేయాల్సి వస్తోందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రతినెలా రూ.12 వేల కోట్లకు మించి ఆదాయం రాకపోవడం, అదే సమయంలో రూ.18 వేల కోట్ల వరకు అనివార్య ఖర్చులు చేయాల్సి వస్తుండటంతో అప్పుల పద్దు ప్రతినెలా పెరిగిపోతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ముగిసిన ఐదు నెలల కాలం కంటే అదనంగా సెప్టెంబర్ నెల ప్రారంభంలోనేప్రభుత్వం ఏకంగా రూ.6 వేల కోట్ల అప్పు తీసుకుంది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా బహిరంగ మార్కెట్‌లో సెక్యూరిటీ బాండ్లను వేలం వేయడం ద్వారా ఈ మొత్తాన్ని సమకూర్చుకుంది. కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం ఈ ఏడాది జూలై 31 వరకు చేసిన రూ.25వేల కోట్లకు తోడు ఆగస్టు నెలలో తీసుకున్న రూ.3వేల కోట్లు, ఈ నెలలో తీసుకున్న రూ.6వేల కోట్లు, ఈనెలలోనే ఇంకా ప్రభుత్వం తీసుకుంటుందని భావిస్తున్న మరో రూ.3వేల కోట్లు కలిపి తొలి ఆరు నెలల్లోనే రాష్ట్ర రుణపద్దు రూ.37వేల కోట్లకు చేరుతుందని అంచనా. ఇది మొత్తం ఏడాది కాలంలో అప్పుల రూపంలో బహిరంగ మార్కెట్ ద్వారా సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న దాదాపు రూ.64వేల కోట్లలో 50 శాతం కంటే రూ.5వేల కోట్లు ఎక్కువే కావడం గమనార్హం.

కనాకష్టంగా సర్దుబాటు

వాస్తవానికి, ఈ ఆర్థిక సంవత్సర ప్రారంభం నుంచే నిధుల సర్దుబాటు కష్టంగా మారింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ఐదు నెలల కాలంలో సొంత పన్నుల ఆదాయం పెద్దగా పెరగలేదు. జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లతోపాటు ఎక్సైజ్, అమ్మకపు పన్ను, కేంద్ర పన్నుల్లో వాటా, గ్రాంట్ ఇన్ ఎయిడ్... ఇలా అన్నిరాబడి మార్గాలు కలిపినా గత ఏడాది కంటే పెద్దగా మార్పు రాలేదు.

ఈ ఏడాది జూలై 31 వరకు కాగ్ వెల్లడించిన గణాంకాల ప్రకారం మొత్తం బడ్జెట్ అంచనాల్లో గత ఆర్థిక సంవత్సరం జూలై నాటికి 26.01 శాతం రాగా, ఈసారి వచ్చింది 26.32 శాతం మాత్రమే. అయితే, ఖర్చుల్లో మాత్రం అనివార్య చెల్లింపులకు తోడు అనూహ్య సర్దుబాట్లు అవసరమయ్యాయి. సాధారణంగా ఇచ్చే వేతనాలు, పింఛన్లు, రెవెన్యూ వ్యయం, ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు, సబ్సిడీలు, సంక్షేమ పథకాలకు చెల్లింపులతోపాటు అంతకుముందు నెలలో రూ.9వేల కోట్ల మేరకు రైతు భరోసా, గత నెలలో రూ.700 కోట్లకు పైగా ఉద్యోగుల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది.

కేవలం 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు సమకూర్చుకొని రైతుభరోసా చెల్లించిన తర్వాత ఖజానా పరిస్థితి మరింత కష్టంగా మారిందని ఆర్థికశాఖ వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే నిధుల సర్దుబాటుకు వేస్అండ్ మీన్స్, ఓవర్ డ్రాఫ్ట్‌లకు వెళుతున్నామని, ఇది సాధారణమే అయినా అనూహ్యంగా ఖర్చులు వస్తే మాత్రం అప్పులు చేయక తప్పడం లేదని ఆ శాఖ వర్గాలు చెబుతుండడం గమనార్హం.

కాగా, ఈ నెల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలకు సంబంధించి ఇంకా కొన్ని శాఖలకు నిధులు విడుదల చేయలేదని తెలుస్తోంది. మార్కెటింగ్ తదితర శాఖల ఉద్యోగులకు ఇంకా వేతనాలు అందలేదని సమాచారం. కాగా, నిధుల సర్దుబాటు కాక ప్రతి నెలా కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులను నెలాఖరు వరకు వాయిదా వేస్తున్నారని, అప్పుడు వచ్చే నిధులకు అనుగుణంగా చివరి రోజుల్లో వీలున్నన్ని బిల్లులు మంజూరు చేస్తున్నారని తెలుస్తోంది.

# జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షా ల నష్టంపై కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి
- తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షా ల వల్ల 5 వేల కోట్ల రూపాయల నష్టం,
- ప్రాథమికంగా అంచనా వేసిన తెలంగాణ ప్రభుత్వం



**న్యూఢిల్లీ సెప్టెంబర్ 04 (సిద్దిపేట పవర్):**

ఇటీవల తెలంగాణలో వర్షాలు వందేళ్ల చరిత్రలో ఎప్పుడూ లేనంత విధ్వంసం సృష్టించాయి. రహదారులు, పంటలు, ప్రజల ఆస్తులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రాథమిక లెక్కల ప్రకారం 5,018 కోట్ల మేర నష్టం జరిగిందని అంచనా. ఈ నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వాన్ని నిధుల కోసం ఒత్తిడి చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది.

తెలంగాణలో వరద నష్టంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు ప్రాథమిక నివేదిక ఇచ్చింది తెలంగాణ ప్రభుత్వం. దేశరాజధాని ఢిల్లీలో అమిత్ షాతో తెలంగాణ డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో వర్షాలు, వరదలు మిగిల్చిన నష్టాన్ని ఆయనకు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణలోని 7 జిల్లాల్లో విపరీతంగా వర్షాలు కురవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

2025 ఆగస్టు 25-28 మధ్య తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయి. ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వరదలు సంభవించి భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ జిల్లాల్లో మౌలిక సదుపాయాలకు తీవ్రమైన నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాధారణం కంటే 25 శాతం అధికంగా ఉంది. ఎనిమిది జిల్లాల్లో 65 నుంచి 95 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. వర్షాలు కొనసాగుతూనే ఉండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు, పంటలు, పశువులు, మానవ ప్రాణాలు నష్టపోయాయని అమిత్ షా కు వివరించారు.

భారీగా కురిసిన వర్షాల తీవ్రతతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా సాధారణ జీవన విధానానికి అంతరాయం ఏర్పడిందని స్పష్టంచేశారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను కోరారు.

తెలంగాణలో భారీ వర్షాల వల్ల పంట నష్టం తో పాటు, ఆస్తి నష్టం జరిగిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాక్ తెలిపారు. చెరువులు కుంటలు తెగిపోవడం, రోడ్లు ధ్వంసం అయ్యాయని కేంద్రానికి నివేదించారు. ప్రాథమిక నివేదిక ప్రకారం దాదాపు 5వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని, కేంద్రం ఎన్డీఏ పాలిత రాష్ట్రాలకు ప్రత్యేక నిధులు ఇస్తున్నట్లుగానే తెలంగాణకు నిధులు ఇవ్వాలని కోరారు.గత ఏడాది ఖమ్మం, పరిసర జిల్లాల్లో భారీ వర్షాల కారణంగా రూ.11,713 కోట్ల సహాయం కోరినా, ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని. అందువల్ల గతంలో కోరిన రూ.11,713 కోట్లతో పాటు తాజా అంచనా రూ.5,018 కోట్లు — మొత్తం రూ.16,732 కోట్లను కేంద్రం తక్షణమే విడుదల చేయాలని బృందం విజ్ఞప్తి చేసింది.

## కలెక్టర్ గారూ నాకు మీరెంత ఫైన్ కడతారని నిలదీసిన కామన్ మ్యాన్



బైక్ మీద వెళ్తుంటే ట్రాఫిక్ పోలీసులు మధ్యలో ఆపి హెల్మెట్ ఉందా? లైసెన్స్ ఉందా? RC ఉందా? పొల్యూషన్ సర్టిఫికెట్ ఉందా అని సవాలక్ష ప్రశ్నలడిగి... ఏ ఒక్కటి లేకపోయినా భారీగా ఫైన్ లు వేసి, వాటిని ముక్కు పిండి మరీ వసూలు చేస్తారు. కొన్నిసార్లు కేసులు బుక్ చేసి కోర్టుల చుట్టూ తిప్పిస్తారు. చిన్నస్థాయి ఉద్యోగులు అయితే వారి జీతంలో పది శాతం వీటికే పోతుంది. అయితే ఈ వ్యవహారంపై ఓ కామన్ మ్యాన్ నడిరోడ్డుపై వినూత్న నిరసనకు దిగాడు. మా దగ్గర ఏ ఒక్కటి లేకపోయినా వందల రూపాయలు ఫైన్ల రూపంలో వసూలు చేస్తున్నారు, మరి మేము ప్రయాణించే రోడ్లు సరిగా లేకుండా, గుంతలమయంగా ఉన్నాయి, వాటికి మీరు ఎంత ఫైన్ కడుతున్నారంటూ నడిరోడ్డుమీద నిరసనకు దిగాడు.

అధికారుల నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ శ్యామ్ కుమార్ అనే వ్యక్తి .. 'పోలీసు కమిషనర్, కలెక్టర్ గారూ.. రోడ్డుమీద వెళ్తున్నపుడు ఏది లేకపోయినా ఫైన్ కడుతున్నాను. అసలు రోడ్లే సరిగా లేవు కదా, మరి మీరు నాకెంత ఫైన్ కడతారు' అని ప్లకార్డ్ ప్రదర్శిస్తూ.. కరీంనగర్‌జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నాకు దిగాడు. అటుగా వెళ్తున్నవారంతా ఆసక్తిగా గమనించి, నిజమే కదా అనుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని, అతన్ని సముదాయించే ప్రయత్నం చేసి విఫలం అయ్యారు. అయితే ఈ తతంగాన్ని అంతా ఓ వ్యక్తి వీడియో తీసి నెట్లో పోస్ట్ చేయగా... ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వేలాది నెటిజన్స్ శ్యామ్ నిరసనను ప్రశంసిస్తున్నారు.

## బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదు...

**హైదరాబాద్ సెప్టెంబర్ 04 (సిద్దిపేట పవర్):**



ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కవిత, బీఆర్ఎస్ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఆమె బీఆర్ఎస్ కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదని... కవితని పార్టీలోకి తీసుకోమని స్పష్టం చేశారు. గబ్బర్ సింగ్ టాక్స్ అన్న వారి తలలో మెదడు లేదు పెండ(గోబర్) ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే.. ఆ రెండు పార్టీ లు అన్నదమ్ములు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి కేవలం బ్యారేజీలపైనే కాదు..మొత్తం ప్రాజెక్ట్ మీద సీబీఐ విచారణ జరపాలన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. కవిత గురించి ఎక్కువగా ఆలోచించొద్దని తెలిపారు. యూరియా కొరతపై స్పందించిన ఆయన.. కాంగ్రెస్ పొరపాటు వల్లనే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు.

" కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్స్ తగ్గించి అన్ని వర్గాలకు పండుగ బహుమానం కేంద్రం ఇచ్చింది. మోడీ నేతృత్వంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పన్నుల వ్యవస్థను సరళీకరణ చేశారు. నిత్యావసర వస్తువులపై టాక్స్ ను జీరో చేశారు. మిడిల్ క్లాస్ ప్రజలకు ఎంతో ఊరట లభించింది. మోడీ, నిర్మల సీతారామన్ కి కృతజ్ఞతలు. జీఎస్టీ రేట్స్ తగ్గించినందుకు నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలకు పిలుపునిస్తున్నాం. రాష్ట్ర మంతటా కార్యక్రమాలు చేయాలి.. వన్ నేషన్ వన్ లా వైపు కూడా వెళ్తున్నాం.. ఎల్లుండి అమిత్ షా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వేడుకల్లో పాల్గొంటారు... అమిత్ షా పార్టీ కార్యక్రమం ఇంకా ఫైనల్ చేయలేదు. అధికారిక కార్యక్రమంతో పాటు మోజమ్జాహి మార్కెట్ లో గణేష్ నిమజ్జన వేడుకల్లో పాల్గొంటారు." అని రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.

## ఎవరిని అడిగి నిర్ణయం తీసుకున్నారు?..



**కవితకు రివర్స్ అయిన జాగృతి సీనియర్లు**

బీఆర్ఎస్ లో చోటు చేసుకున్న పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీకి, పదవికి రాజీనామా చేసిన కవిత భవిష్యత్ కార్యాచరణ ఎలా ఉండబోతున్నది అనే చర్చ జరుగుతున్న వేళ జాగృతి సీనియర్లు కవితకు రివర్స్ అయ్యారు. తెలంగాణ జాగృతి ఏర్పాటు నుంచి కీలకంగా వ్యవహరించిన తెలంగాణ ఫుడ్స్ కార్పోరేషన్ మాజీచైర్మన్ మేడే రాజీవ్ సాగర్, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్‌గా మఠం భిక్షపతి, కొదారి శ్రీను సహా పలువురు ముఖ్య నేతలు కవితతో తాము నడవడం లేదని ప్రకటించారు. తామంతా కేసీఆర్ వెంటే ఉన్నామని తెలిపారు. ఇవాళ హైదరాబాద్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం భిక్షపతి మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా కవితతో ప్రయాణం చేసిన తాము ఇవాళ బరువెక్కిన గుండెలతో మాట్లాడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాక్షసపాలన సాగుతోందని ఈ పాలన పోయి మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న సందర్భంలో కేసీఆర్ వెన్నంటే ఉంటూ ఉద్యమాలు చేయాల్సిన కవిత.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కు ఊతమిచ్చేలా వ్యవహరిస్తున్న కవిత తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అనేక సందర్భాల్లో పస్తులుండి మీరు చెప్పిన పనులు చేశాం. ఇన్నాళ్లు మీ వెంట నడిచాం. కానీ ఇప్పుడు మాకు సమాచారం ఇవ్వకుండానే సొంత ఎజెండాతో నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ఏనాడైనా మా బాగోగులు కనుకున్నారా? అని కవితను నిలదీశారు. ఇప్పటికీ అనేక మంది తెలంగాణ జాగృతి నేతలు ఇళ్లలో పూట గడిచే పరిస్థితి లేదు. ఇదేనా మీరు మాకిచ్చే గుర్తింపు అని ప్రశ్నించారు. మీ వెంట నడిచిన మాకు వేళ సంఖ్యలో కార్యకర్తలు ఉన్నారు. వారి పరిస్థితి ఏంటన్నారు. డబ్బున్న కొత్త నాయకులను కొత్తగా తీసుకోచ్చుకుని సొంత ఎజెండాతో వెళ్తే ఇన్నాళ్లు మీకోసం పని చేసిన జాగృతి బిడ్డల ఉసురు పోసుకుని పోయినట్లు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ జాగృతి మా అందరిదని మేము కేసీఆర్ వెంట ఉన్నామన్నారు. మీ వెంట తీసుకువెళ్తున్నది తెలంగాణ జాగృతి కాదని అది కాంగ్రెస్ జాగృతి అన్నారు. ఈ వేదికపై ఉన్నదే అసలైన తెలంగాణ జాగృతి అన్నారు. కవిత చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయని కవిత వ్యాఖ్యలు చేస్తే కవితపై ఎలాంటి విమర్శలు చేయవద్దని ఆమె మా ఇంటి ఆడబిడ్డ అని శ్రేణులకు హరీశ్ రావు చెప్పారని ఇందుకు నేనే సజీవ సాక్ష్యం అన్నారు. హరీశ్ రావు పార్టీని లాక్కోవాలని చూస్తున్నారని కవిత అంటున్నారు. కానీ హరీశ్ రావు మాత్రం మనమంతా కేసీఆర్ కోసమే పని చేయాలని కార్యకర్తలందరికీ అనేక సందర్భాల్లో చెప్పారన్నారు. హరీశ్ రావు విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారని నాలుగు నెలల క్రితం కవితనే ఓ మీడియాతో చెప్పారు. అంటే నాలుగు నెలల క్రితం చెప్పిన మాటలు అబద్ధమా? లేక తాజాగా చేసిన వ్యాఖ్యలు అబద్ధమా చెప్పాలన్నారు.

**జాగృతిపై మాకూ హక్కుంది: మేడే రాజీవ్ సాగర్**

మేడే రాజీవ్ సాగర్ మాట్లాడుతూ.. ఇన్నాళ్లు కవితను కుర్చీపై ఉంచి కిందుండి తాము పని చేశామని ఆమె ఏ పిలుపు ఇచ్చినా రాత్రింబవళ్లు సక్సెస్ చేశామన్నారు. కేసీఆర్ ఉన్నారు కాబట్టే తామంతా తెలంగాణ జాగృతికి పని చేశామని ఎప్పుడైతే సొంత ఎజెండాతో కేసీఆర్ కు వ్యతిరేకంగా పని చేయడం మొదలు పెట్టారని విమర్శించారు. ఇన్నాళ్లు జాగృతితో నడిచిన తమతో కనీసం ఒక్కసారి కూడా కవిత మాట్లాడకుండా ఈ నిర్ణయాలన్నీ తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీరు చెప్పిన ప్రతి పనిని చేసుకుంటూ ముందుకు వెళ్లిన తమను ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ఈ మీ మాటను నమ్మి మీ వెంట 18 ఏళ్లుగా అనేక మంది నడిచారని వారందరి జీవితాలు ఏం కావాలని ప్రశ్నించారు. మీరు తీసుకున్న నిర్ణయం వల్ల మా జీవితాలన్నీ రోడ్డున పడ్డాయన్నారు. ఇన్నాళ్లు తామంతా బీఆర్ఎస్ కు అనుబంధంగా ఉన్న తెలంగాణ జాగృతిలో పని చేశామని జాగృతిపై కవితకు ఎంత హక్కు ఉందో మాకూ అంతే హక్కు ఉందన్నారు. అందువల్లే ఇవాళ తాము జాగృతి ఫోటో పెట్టుకుని మాట్లాడుతున్నామన్నారు. మేము కూడా తెలంగాణ జాగృతి పేరుతోనే పని చేస్తామని అయితే మేమంతా కేసీఆర్ కోసం పని చేస్తామన్నారు.

# రెక్క ఆడితేనే గాని డొక్కాడని పరిస్థితి మాది...

**పెద్ద గుండవెల్లి ప్రజల ఆవేదన..........**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 4 ప్రతినిధి**




నిన్న మొన్నటి ఏకాదటిగా కురిసిన అకాల వర్షాలకు ఎడతెరిపి లేకుండా అల్పపీడ ద్రోని వల్ల కురుస్తున్నా అకాల వర్షాలకు ఇండ్లు కూలిపోయాయి.సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని పెద్ద గుండవెల్లి గ్రామంలోని కొంతమంది నిరుపేదల ఇండ్లు కూలిపోవడం చాలా బాధాకరమైనటువంటి విషయం కట్టే స్తోమత లేక విలవిలలాడుతున్నటువంటి గ్రామంలోని ప్రజలు ప్రభుత్వం వెంటనే మమ్ములాను ఆదుకొని మాకు ఇందిరమ్మ ఇల్లు గాని లేదా ప్రభుత్వం తోచినంత మాకు సాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాము.ఈ రోజుల్లో పూట గడవని పరిస్థితుల్లో మాకు ఇల్లు కట్టుకోవాలంటే కట్టలేని పరిస్థితిలో ఉన్నాం.కష్టం చేసుకుంటేనే బుక్కెడు అన్నం తినే పరిస్థితి మాది కాబట్టి ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మాకు తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని తెలిపారు.



# గజ్వేల్ ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం ఇవ్వకుంటే పోరాటం తప్పదు

- మరాఠీ కృష్ణమూర్తి ఎంజేఫ్ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి
- నిజమైన జర్నలిస్టులకు సభ్యత్వం ఇవ్వకుండా అన్యాయం ?
- గజ్వేల్ జర్నలిస్టులకు ఇవ్వకుండా ఇతర నియోజకవర్గాల వారికి సభ్యత్వం ఎలా ఇస్తారు ?
- 25 ఏళ్ల నుంచి జర్నలిస్టులకు మీరు చేసిన సేవలు ఏమిటి?







**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ ప్రెస్ క్లబ్ 25 ఏళ్ల రజతోత్సవం జరుపుకుంటున్న తరుణంలో వివాదం చెలరేగింది. నిజంగా గజ్వేల్‌లో పని చేస్తున్న జర్నలిస్టులకు సభ్యత్వం ఇవ్వకుండా, ఇతర నియోజకవర్గాల వ్యక్తులకు, ఇంకా జర్నలిస్టులు కానివారికే సభ్యత్వం కల్పించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తి ఈ అంశంపై గజ్వేల్ ఆర్డీవో వివిఎల్ చంద్రకళకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మరాఠీ కృష్ణమూర్తి మాట్లాడుతూ – "ఇది జర్నలిస్టుల రజతోత్సవమా? లేక కొందరి వ్యక్తిగత ప్రతిష్ట, ? ప్రెస్ క్లబ్ నిజమైన జర్నలిస్టుల అవసరాల కోసం నిర్మించబడిందా? లేక దుకాణాల అద్దెతో ఆదాయం చూసే వ్యాపార సముదాయమా?" అని ప్రశ్నించారు.రజితోత్సవాల్లో పాల్గొనబోయే మంత్రులకు ఎంపీలకు సైతం ఈ విషయాన్ని చేరవేస్తామని గజ్వేల్ ప్రజలను సైతం దీనిపై సంఘటితం చేస్తామన్నారు. గజ్వేల్ లో పనిచేసే జర్నలిస్టులకు కూర్చోవడానికి స్థలాలు లేక టీ పాయింట్లలో చెట్ల కింద కూర్చొని వానకు తడుస్తూ ఎండకు ఎండుతూ తన కర్తవ్యాలను నిర్వహిస్తు వార్తలు రాస్తున్నారని ఇంత పెద్ద ప్రెస్ క్లబ్ ఉంటే జర్నలిస్టులకు ఎందుకు ఉపయోగపడటం లేదని ప్రశ్నించారు? 25 సంవత్సరాలుగా గజ్వేల్ లో జర్నలిస్ట్ కుటుంబాలకు ఎలాంటి సహాయ సహకారాలు చేయలేదని ప్రజలకు సైతం ఎలాంటి అవసరాలు తీర్చలేక వారి వ్యక్తిగత అవసరాల కోసమే ప్రెస్ క్లబ్ ను నడుపుతున్నారని మండిపడ్డారు.గజ్వేల్‌లో పనిచేస్తున్న పలువురు జర్నలిస్టులు కూడా తమ ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రెస్ క్లబ్‌లో సభ్యత్వం రావాలంటే నిజమైన వార్తలు రాయడం కాదు, అధ్యక్షున్నీ జోకితే చాలు" అనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజకీయ, వ్యక్తిగత ఫేవర్స్ ఆధారంగానే సభ్యత్వం ఇస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. "ప్రజల కోసం కాదు, సొంత లాభం కోసం మాత్రమే రజతోత్సవం జరుగుతోంది" అన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి.25 ఏళ్ల ప్రస్థానం జర్నలిస్టుల కృషి ప్రతిబింబం కావాలని జర్నలిస్టులు కోరుకుంటున్నారు. కానీ నిజమైన జర్నలిస్టులకు సభ్యత్వం ఇవ్వకుండా పక్కన పెట్టడం, జర్నలిస్టుల పేరుతో కొందరి వ్యక్తిగత వేడుకల్లా మార్చుకోవడం – ఇదే గజ్వేల్ ప్రెస్ క్లబ్ పరిస్థితి అని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో గజ్వేల్ డివిజన్ నాయకులు మస్కూరి జహంగీర్ తుడుం ఎల్లం రాజు కనకయ్య వెన్నెల స్వామి మాదారం మహేష్ తో పలువురు పాల్గొన్నారు. వీరికి పలు జర్నలిస్ట్ సంఘాలు మద్దతు తెలిపాయి.

# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ ప్రజలు

**చేర్యాల, సెప్టెంబర్ 4 (సిద్దిపేట పవర్)** చేర్యాల మండలం వీరన్నపేట గ్రామ పంచాయతీలో పని చేసిన గూడేపు బిక్షపతి కొద్ది రోజుల క్రితం చనిపోయాడు..ఆయన కుటుంబం పేదరికంలో ఉన్నదని తెలుసుకున్న గ్రామ ప్రజలు ఆర్థిక సహాయం అందించారు.. గ్రామ ప్రజలు మొత్తం కలిసి రూపాయలు 25,300 జమచేసి ఈరోజు వారు కుటుంబానికి అందచేశారు.. ఈ సందర్భంగా తమ కుటుంబానికి అండగా నిలిచిన గ్రామ ప్రజలకు కిష్టయ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు..వీరన్నపేట గ్రామ ప్రజలు చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి, ఆ కుటుంబం ఒంటరి కాదు అని వారికి మేము అందరం ఉన్నామని ఆత్మీయ భరోసాను కలిగించారు..



# 9 వ రోజు దుబ్బాక కత్తి కార్తిక గౌడ్ అక్క బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల కార్యకలాపాలు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 4 ప్రతినిధి**

దుబ్బాకలో కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా, 9 వ రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా దుబ్బాక ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దర్శనార్థం వచ్చిన భక్తులకు అన్నప్రసాదాల వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముగిసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు

- జగదేవపూర్ ఆర్యవైశ్యులు అభినందనీయులు
- డాక్టర్ దేశబోయిన నర్సింలు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** జగదేవపూర్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించి గురువారం గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి విగ్రహ దాత దంపతులను సన్మానించిన ఆర్యవైశ్యులు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింలు మాట్లాడుతూ గణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, జగదేవపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఒకే మాట ఒకే బాట అనే తీరుగా ఒకే గణపతిని ప్రతిష్టించి సోదర భావంతో అందరూ ఒక తాటిపైకి వచ్చి భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహించడం అభినందనీయమని, వ్యాపార రంగంలో రాణిస్తూ ధార్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు అభినందనీయులు అని అన్నారు, అనంతరం ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఎంసీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్, ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ మండల అధ్యక్షుడు గుబ్బ శ్రీనివాస్ మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాలు క్రితం ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో గణపతి విగ్రహం ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు అందరం కలిసి భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని అదే విధానం ఇప్పుడు కూడా కొనసాగడం, జరుగుతుందని ఒక ఇంటి పండుగ వలె అందరం కలిసి గణపతి నవరాత్రులు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్ధ జ్యోతి మహేందర్, బుద్ధ చిన సత్యం, అమర రాము, నాచారం మాజీ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, యువజన అధ్యక్షుడు రామకృష్ణ, సేవాదళ్ అధ్యక్షుడు లక్ష్మణ్, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీనివాస్, కోశాధికారి అయిత బాలరాజ్, పట్టణ అధ్యక్షులు చిగుల్లపల్లి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, కోశాధికారి అమర శ్రీనివాస్, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ రావికంటి సవిత శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు అమర నాగజ్యోతి రామ్ నివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి వల్లాల రజిత వెంకటేశం, పట్టణ కోశాధికారి అమర మేఘమాల శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు చంద్ర శేఖర్, పట్టణ మాజీ అధ్యక్షుడు కుకుటపు కొండలు నాయకులు బుద్ధ సత్యపాల్ రాములు రవి మహిళలు చిన్నారులు యువకులు పట్టణ ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో వ్యక్తి మృతి

**మృతుని కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థిక సహాయం**

**నంగునూరు, సెప్టెంబర్ 4( సిద్దిపేట పవర్ )** నంగునూర్ మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన ఆర్.ఎం.పి సత్యం బుధవారం రోజు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ రాష్ట్ర ఆయిల్ ఫామ్ రైతు వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షులు ఎడ్ల సోమిరెడ్డి మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్యే హరీష్‌రావు కి తెలుపగా తక్షణమే స్పందించి కుటుంబానికి 10000 రూ .ఆర్థిక సహాయాన్ని కుటుంబానికి అందజేసి కుటుంబాన్ని పరామర్శించారు ఈ పరామర్శ కార్యక్రమంలో నంగునూరు పిఎసిఎస్ చైర్మన్ కోల రమేష్ గౌడ్. నాయకులు బేదురు తిరుపతి, లక్ష్మారెడ్డి, పరశురాములగౌడ్, ఘనపూర్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన భవన కార్మికులు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** జగదేవపూర్ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పిందని భావన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నర్ర బిక్షపతి అన్నారు.గురువారం మండల కేంద్రము లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర భావన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమల్ల ఐలయ్య ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు నర్ర బిక్షపతి ఆధ్వర్యంలో మండల భావన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కోట ఆశయ్య ,వివిధ కార్మికుల సంఘం అధ్యక్షులు కార్మికుల సమక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు శుభ వార్త చెప్పిందని అన్నారు. భవన నిర్మాణ రంగాల కార్మికుల ఎక్స్ గ్రేషియ పెంపుతో రాష్ట్రంలో 15 లక్షల మంది వర్కర్లకు వర్తిస్తుందని తెలిపారు.గత ప్రభుత్వంలో కార్మికులను పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు.భవన, నిర్మాణ రంగల కార్మికులకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియా పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అందులో భాగంగా యాక్సిడెంటల్ డెత్ ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచారని అలాగే సహజ మరణానికి ఇచ్చే సాయాన్ని రూ.2 లక్షలకు పెంచుతున్నట్లు కార్మిక శాఖ ప్రకటించిందని తెలిపారు. వివిధ నిర్మాణ పనులు చేస్తున్న వారు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఈ ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఎక్స్‌గ్రేషియా పెంచాలని గత సర్కార్ హయాంలో ఎన్నో సార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిహారాన్ని పెంచడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర మంత్రివర్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషన్ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లేష్, బాల్ నర్సయ్య, నారాయణ శ్రీను బలేష్ స్వామి నర్సింలు శ్రీధర్ బాల్ నర్సు, నర్సింలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# బైకుల దొంగ దంపతులను పట్టించిన సీసీ టీవీ ఫుటేజీ

- మద్యం, సిగరేట్లకు అలవాటై...బైక్ దొంతనాలు..
- రూ.5లక్షల విలువ చేసే ఆరు బైకుల స్వాధీనం




**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్) :** ప్రభుత్వ ఆసుపత్రులను టార్గెట్ చేసుకుంటూ వరుసగా బైక్ దొంగతనాలు చేస్తున్న ఇద్దరు దొంగ దంపతులను చిలకలగూడ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.ఐదు లక్షల విలువ చేసే ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలానికి చెందిన కొటగిరి వినోద్ (30), అతని భార్య పావని (19) లు మద్యం, సిగరెట్ అలవాట్లకు డబ్బు కోసం బైక్ దొంగతనాలు చేస్తున్నారు. గాంధీ ఆసుపత్రి సహా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద పార్క్ చేసిన బైక్‌లను అపహరిస్తూ వచ్చారు. ఆగస్టు 20న గాంధీ ఆసుపత్రి పార్కింగ్‌లో నిలిపిన బైక్‌దొంగతనంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఆధారాలతో వారిని గుర్తించారు.సెప్టెంబర్ 3న ఉదయం చిలకలగూడ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి గాంధీలో దొంగిలించిన నాలుగు బైక్‌లు, భువనగిరి టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో రెండు బైక్‌లు సహా మొత్తం ఆరు బైక్‌లు (విలువ రూ.5 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌ను ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బీ. బాలస్వామి, అదనపు డీసీపీ జె. నర్సయ్య, ఏసీపీ కే. శశాంక్‌రెడ్డి నేతృత్వంలో చిలకలగూడ పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. కేసును చేధించిన సీఐ అనుదీప్, డీఐ రమేశ్ గౌడ్, ఎస్.ఐ రాకేశ్ లను అభినందించి, రివార్డులను అందచేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగారాలి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 4 ప్రతినిధి**

దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి తొగుట మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.. ఈ సందర్భగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయలి అని ఆయన అన్నారు. కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందని, రానున్న సర్పంచ్, ఎంపిటిసి, జడ్పీటీసీ ఎన్నికలలో పార్టీ జెండా ఎగరవేయాలని తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి కార్యకర్త సైనికుడిల పనిచేయాలన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు.కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కృషిచేయాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), తొగుట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి, ఉపాధ్యక్షులు అనిల్, మాజీ సర్పంచ్ చిలివేరి రాంరెడ్డి, తోయేటి ఎల్లం, ఉప్పలయ్య, కుంభం బాల్ రెడ్డి, నాయకులు నిరంజన్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కృష్ణ, కుంభాల శీను కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...





# ప్రతీ పౌరుడు సైబర్ క్రైమ్ పై అవగాహన కలిగి ఉండాలి

**చేర్యాల SI నవీన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

**చేర్యాల, సెప్టెంబర్ 4 (సిద్దిపేట పవర్)** సమాజంలో ప్రతీ పౌరుడు సైబర్ క్రైమ్ మీద అవగాహన కలిగి ఉండాలి చేర్యాల SI నవీన్ తెలిపారు.. గురువారం చేర్యాల లో స్థానిక పౌరులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు..ఈ సందర్భంగా SI నవీన్ మాట్లాడుతూ సెల్ ఫోన్ లో వచ్చే అనవసరమైన లింక్ ల మీద క్లిక్ చేయవద్దని, ముక్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు బ్యాంక్ నుండి ఫోన్ చేస్తున్నాం అంటే నమ్మవద్దు అని, వారికి బ్యాంకు కి సంబంధించిన వివరాలు ఇవ్వవద్దు అని తెలిపారు..ఒకవేళ మీ డబ్బులు సైబర్ క్రైమ్ ద్వారా పోయాయి అని మీకు తెలిస్తేవెంటనే 1930 నెంబర్ కి లేదా స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని SI నవీన్ తెలిపారు.. కార్యక్రమంలో బి.ఆర్.ఎస మండల నాయకులు జంగిటి బిక్షపతి, చేర్యాల పట్టణ ప్రజలు పాల్గొన్నారు..



# ఎల్ఐసి ఆఫ్ ఇండియా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

**రాణించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ స్టూడెంట్స్**

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్ ) :** లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన డ్రాయింగ్, వ్యాసరచనా రైటింగ్ పోటీలలో భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభతో పలు బహుమతులను గెలుచుకున్నారు. ఈ పోటీల్లో చీరాల గాయత్రి డ్రాయింగ్‌లో మొదటి బహుమతి సాధించగా, శివం కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. కే. మణితేజ్ గౌడ్ ఎస్సే రైటింగ్‌లో సెకండ్ ప్రైజ్ అందుకోగా, కన్సోలేషన్ ప్రైజ్ సేతుచంద్ర పొందారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్, హెడ్ మాస్టర్ డాక్టర్ వరలక్ష్మి మంచాల, విద్యార్థులను అభినందించారు.

# దుబ్బాక కత్తి కార్తిక గౌడ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

**మాజీ ఉపసర్పంచ్ మిద్దె జాన్సన్ అలియాస్ నర్సింలు అభిందించిన కత్తి కార్తీక గౌడ్**

**దుబ్బాక, సిద్ది పేట పవర్ న్యూస్ సెప్టెంబర్: 4 ప్రతినిధి** దుబ్బాక పట్టణంలోని కత్తి కార్తీక గౌడ్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక స్వామివారి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా అధిక భక్తజణంతో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి.ఈ ఉత్సవాల్లో భాగంగా గంభీర్ పూర్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ మిద్దె జాహ్నసన్ (అలియా స్) నర్సిములు 9 వ రోజు కార్యక్రమాలు వరకు భక్తిశ్రద్ధలతో పాల్గొని అన్న ప్రసాద వితరణ సేవ కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుంది.ఈ సందర్భంగా నూతన వస్త్రాలను అతనితోపాటుగా పలువురిని అభినందిస్తు కానుక అందించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మల్లేశం ,మహిళా నాయకురాలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలే ఉపాధ్యాయులు అయిన వేళ

**ప్రెజెంటేషన్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం**

**చేర్యాల, సెప్టెంబర్ 4 (సిద్దిపేట పవర్)** చేర్యాల పట్టణంలో ఉన్న ప్రెజెంటేషన్ పాఠశాలలో టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు..ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జ్యోతి మొదటగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి దండ వేసి నివాళులు అర్పించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఈరోజు పిల్లలు ధరించడం వల్ల వారికి కలిగిన ఆనందం మాటల్లో వర్ణించలేము అని తెలిపారు.. ఉపాధ్యాయులు గా మారిన పిల్లలు మాట్లాడుతూ మాకు ఈ అవకాశం కల్పించిన మా టీచర్లకు ప్రత్యేక ధన్యవాదాలు అని, ఈ





# విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి..!

- డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలి
- మిషన్ భగీరథ వాటర్ వృధాగా పోతున్నట్లు గమనించిన కలెక్టర్ ఆగ్రహం
- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట పవర్, సిద్దిపేట, సెప్టెంబర్ 04,**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. వంట గదికి వెళ్ళి అన్నం కూరగాయలు పరిశీలించారు. రుచికరంగా వండాలని కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పక్కన మిషన్ భగీరథ వాటర్ వృధాగా పోతూన్నట్లు గమనించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భగీరథ నీరు వృధాగా వదిలేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అన్ని తరగతి గదులు తిరిగి విద్యార్థులతో మాట్లాడారు... విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బాగా చదవాలని హాస్టల్ మంచి అలవాట్లను బాగా నేర్పిస్తుంది ఒక లక్ష్యం పెట్టుకొని చదివి జీవితం లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను మోటివేట్ చేశారు. తరగతి గదులలో వెనక లైటింగ్ సరిపోవట్లేదు అదనపు లైట్లు అమార్చాలని, అలాగే విద్యాలయ ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచాలని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# గాంధీ ఆసుపత్రిలో పెయిన్ క్లినిక్ ప్రొసీజర్ రూమ్ ప్రారంభం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్) :** గాంధీ ఆసుపత్రిలో పెయిన్ క్లినిక్ ప్రొసీజర్ రూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దాతగా ముందుకు వచ్చిన ప్రొఫెసర్ పద్మావతి రఘువేంద్రరావు రూ.20 లక్షల విలువైన మెడికల్ ఎక్విప్‌మెంట్ను అందించారు. వీటిలో సీ-ఏఆర్ఎమ్, ఓటీ టేబుల్, ఓటీ లైట్, పేషెంట్ మానిటర్ వంటి పరికరాలు ఉన్నాయి. అలాగే 2023 బ్యాచ్ పీజీ విద్యార్థులు కూడా రూ.1 లక్ష విలువైన వైద్య పరికరాలను దానం చేశారు. అంతకుముందు జీఎంసీ జీఏ తరపున ఒక యూఎస్జీ మెషిన్ డొనేట్ చేశారు. దీంతో ఏప్రిల్‌లో ప్రారంభమైన పెయిన్ క్లినిక్ ఇప్పుడు పూర్తిస్థాయి పరికరాలతో రోగులకు సేవలు అందించడానికి సిద్ధమైందని అనస్తీషియా హెచ్ఓడీ డాక్టర్ ఆవుల మురళీదర్ తెలిపారు. ఈ ప్రొసీజర్ రూమ్ ప్రారంభం ద్వారా గాంధీ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఇందిర,సూపరింటెండెంట్ డా.రాజకుమారిలు తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా.శేషాద్రి, డా.కళ్యాణచక్రవర్తి,డా.సుబోధ్,డా.మాదాల కిరన్,డా.అబ్బయ్య,డా.రవి, డా.ఉపేందర్ గౌడ్, వైద్యులు, పీజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.






# కిడ్నీ వ్యాధుల పట్ల అవగాహన పై గాంధీలో ర్యాలీ

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్) :** కిడ్నీ వ్యాధుల వల్ల కలిగే అనర్ధాలపై గాంధీ మెడికల్ కళాశాలలో నెఫ్రాలజీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర జండా ఊపి ర్యాలీ ని ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ... పాలిసిస్టిక్ కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జెనెటిక్స్ వల్ల వచ్చే కిడ్నీ ప్రాబ్లమ్స్ పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులను ముందస్తుగా గుర్తించినట్లయితే వారికి చికిత్స సులభంగా ఉంటుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రవిశేఖర రావు మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించే ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న నెఫ్రాలజీ డిపార్ట్మెంట్ వారిని అభినందించారు. నెఫ్రాలజీ డిపార్ట్మెంట్ డాక్టర్లు శ్రీనివాస్ శ్రీకాంత్ ఎంపిహెచ్ఓ వేణుగోపాల్ గౌడ్ గాంధీ నర్సింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# గంభీర్ పూర్ లో సర్వేపల్లి రాధాకృష్ణ ఘనంగా వేడుకలు గురుపూజోత్సవం

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 4 ప్రతినిధి** దుబ్బాక మండల పరిధిలోని గంభీర్ పూర్ ప్రధాన ఉపాధ్యాయులు గురుపూజోత్సవ ఈకార్యక్రమం నిర్వహించారు. దుబ్బాక మండల గంభీర్ పూర్ ప్రాథమిక కొన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి . మాధవి ఉపాధ్యాయులు శ్రీను . బి . బాలకృష్ణ తెలిపారు. మాట్లాడుతూ...మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు మంచి విలువ నిచ్చి భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులను చక్కటి చదువు నేర్పి విద్యావంతులం చేయడమే ఉపాధ్యాయుల లక్షణమని వారు మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్పరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పుట్టినరోజు సందర్భంగా భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నాము... ఈరోజు దుబ్బాక మండలంలోని గంభీర్ పూర్ ప్రధాన ఉపాధ్యాయుల మీద ఇంకా గురితరమైన బాధ్యత పెరుగుతుందని ఇంకా భవిష్యత్తులో మండలానికి మంచి పేరు తీసుకు రావాలని కోరడమైనది.. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. యాదయ్య SGT PS గంభీర్ పూర్ ఈ గురుపూజోత్సవ కార్యక్రమంలో దుబ్బాక మండలం



గంభీర్పూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల , వి .శ్రీను, , తదితరులు పాల్గొన్నారు.




# గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మహ అన్నప్రసాదం వితరణ

**నంగునూరు సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్ )** గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన మండపాల్లో శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు నంగునూరు మండలం నర్మేట గ్రామంలో గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు నర్మెట గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయటం జరిగింది అనంతరం లక్ష్మీ నరసింహ చిత్రాన్ని ప్రదర్శించడం జరిగింది అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు ఉత్సవ సమితి సభ్యులు కుచన్ విక్రమ్,మోతకాని అశోక్, బండోజు మహేష్, కత్తి బాలకృష్ణ, గట్టు ఐలయ్య నార్లపురం రాంమోహన్ నాగిళ్ళ చెంద్రశేఖర్, తేలు సురేష్ నమ్మకపల్లి రాజు వడ్లకొండ శ్రీనివాస్ కలకుంట్ల స్వామి బాబు ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# దుబ్బాకలో ఘనంగా గురుపూజోత్సవం

**దుబ్బాక సిద్దిపేట పవర్ సెప్టెంబర్ 4 ప్రతినిధి** దుబ్బాక మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఈరోజు మండల వనరుల కేంద్రం దుబ్బాకలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన...నరేందర్ రెడ్డి MPO దుబ్బాక మాట్లాడుతూ... మన జీవితంలో ఉన్నత స్థానం గురువుకు ఇస్తాం. మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిది. అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా భారతదేశంలో టీచర్స్ డే జరుపుకుంటున్నాము... ఈరోజు దుబ్బాక మండలంలోని 15 మంది ఉపాధ్యాయులను సన్మానించుకోవడం గొప్ప విషయమని, ఈరోజు సన్మానం పొందిన ఉపాధ్యాయుల మీద ఇంకా గురితరమైన బాధ్యత పెరుగుతుందని ఇంకా భవిష్యత్తులో మండలానికి మంచి పేరు తీసుకు రావాలని కోరడమైనది..ఈ కార్యక్రమంలో సన్మానం పొందిన మండల ఉత్తమ ఉపాధ్యాయులు...1.చెట్టి వరలక్ష్మి SGT PS తిమ్మాపూర్ 2.శ్రీ చెరుకు సంతోష్ కుమార్ SGT PS చెల్లాపూర్ 3.శ్రీ తూటి యాదయ్య SGT PS గంభీర్ పూర్ 4 శ్రీ దారబోయిన మహేశ్ SGT PS చీకోడ్ 5.శ్రీమతి తాటికొండ మంగ SGT UPS రఘోత్తంపల్లి 6.శ్రీహోజి భాగ్యలక్ష్మి SGT UPS కమ్మరపల్లి 7.శ్రీగంట్యాల వెంకటేశం SGT UPS గోసాన్ పల్లి 8. అంతమ్మగారి సుజాత SGT UPSపద్మనాభునిపల్లి 9.నర్రనాగరాణి CRTతెలుగు KGBV దుబ్బాక 10.శ్రీమతి కొట్టె మంజుల SA హిందీ ZPHS చెల్లాపూర్ 11.శ్రీ కోరంపల్లి రామచంద్రం SA ఆంగ్లం ZPHS దుంపలపల్లి 12.శ్రీ పొలాస మధు SA గణితశాస్త్రం ZPHS చీకోడ్ 13.శ్రీమతి కుంబాల జ్యోతి PGT రసాయన శాస్త్రం TGMS లచ్చపేట 14.యెర్రగుంట పద్మ SA జీవశాస్త్రం ZPHS హబ్సిపూర్ 15.శ్రీ గొడుగు యాదబాపు SA సాంఘిక శాస్త్రం ZPHS చెల్లాపూర్ ఈ గురుపూజోత్సవ కార్యక్రమంలో... శ్రీ పి. భూపాల్ CHM ZPGHS దుబ్బాక,శ్రీ జి బాల్ రాజు, CHM చీకోడ్, శ్రీ బి రవీందర్, CHM ధర్మాజిపేట, ఎస్. బుచ్చిబాబు ప్రిన్సిపల్ TGMS, లచ్చపేట మరియు దుబ్బాక అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు పల్లె శ్రీనివాస్ గౌడ్,కాల్వ శ్రీకాంత్ ఆకుల లక్ష్మణ్, బొంబాయి శ్రీను, రాజు ,రవీందర్ రెడ్డి, యాదగిరి ,ప్రవీణ్ రెడ్డి మరియు అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు ఎస్. నరసింహ రావు ఎమ్మార్సీ సిబ్బంది , సి ఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.



# నల్లగుట్ట స్కూల్ లో ఘనంగా టీచర్స్ డే సెలబ్రేషన్స్...

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 04 ( సిద్దిపేట పవర్):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని ముందస్తుగా నల్లగుట్ట ఓల్డ్ ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ లో గురువారం ఘనంగా నిర్వహించారు.డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. హెడ్మాస్టర్చిన్నాబత్తిని శౌరి మాట్లాడుతూ.. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన ఆచరణ, ఆలోచనలు ఉపాధ్యాయ వృత్తికి మార్గదర్శకం అన్నారు. ఉపాధ్యాయులు జాకీరా సుల్తానా, శైలజ, సుమలత, కిరణ్మయి, తరుణ్, రాములు, కుమారి, ప్రసన్న, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు



# గజ్వేల్ పట్టణంలో యునైటెడ్ సోల్స్ ఫుట్వేర్ షాప్ ప్రారంభం

**గజ్వేల్ టిఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ ఎదురుగా యునైటెడ్ సోల్స్ ఫుట్వేర్ షాపు ప్రోపరేటర్ అష్రఫ్ అష్రఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్ టిఆర్ఎస్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యునైటెడ్ సోల్స్ ఫుట్వేర్ షాప్ ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ ఎదురుగా యునైటెడ్ సోల్స్ ఫుట్వేర్ షాపు అష్రఫ్ ప్రోపరేటర్ ఆధ్వర్యంలో ప్రారంభించబడిందని అన్నారు. ఫుట్వేర్ విద్యార్థులకు గాని యువతకు గాని వృద్ధులకు గాని సరసమైన ధరలకు మన్నిక నాణ్యమైన చెప్పులు దొరుకుతాయని తెలిపారు. వాకింగ్ షూ గాని కాంఫర్స్ కంఫర్ట్ షూ గాని లేటెస్ట్ లేటెస్ట్ న్యూ మోడల్ చెప్పులు ఉన్నాయని అన్నారు. వ్యాపార రంగంలో అభివృద్ధి చెందాలని స్వయంకృషితో ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కనకయ్య తుమ్మ నరసయ్య పిఎసిఎస్ డైరెక్టర్ మల్లేష్ గౌడ్ మన్నె వెంకట్ రమేష్ ఉపేందర్ గౌడ్ హరికృష్ణ ఇషాన్ భాయ్ మజార్ షాదుల్ వేణు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.






# వినాయక మండపాలను సందర్శించిన కార్పొరేటర్ దీపిక..

**సికింద్రాబాద్, సెప్టెంబరు 04( సిద్దిపేట పవర్):** వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మోండా డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన పల వినాయక మండపాలను గురువారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక సందర్శించారు. బండిమెట్, లోహియా నగర్, కుమ్మరిగూడ, ఈస్ట్ మారెడుపల్లి,పాజ్ బజార్,చప్పల్ బజార్, బన్సీలాల్ పేట తదితర ప్రాంతాల్లో మండపాలను సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 6న జరిగే వినాయక నిమజ్జనాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని,ర్యాలీ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండప నిర్వాహకులకు కోరారు. ఈ కార్యక్రమాల్లో డివిజన్ అధ్యక్షుడు జిత్తు, నాయకులు ప్రశాంత్, సాయి , రాహుల్, హరి, నర్సింగ్, యాదగిరి, రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాల వరలక్ష్మి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డు

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ సెప్టెంబర్ 4 ప్రతినిధి** సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చెట్టి వరలక్ష్మి మండల స్థాయి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు వరలక్ష్మీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు రావడం ఆనందదాయకంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు భవిష్యత్ తరాల భవిష్యత్ రోజుల్లో ఇంకా బాగా బోధన చేస్తానని విద్యార్థిని



విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందజేస్తానని ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పేర్కొన్నారు.

# రూ.20వేల లంచం.. ఏసీబీకి చిక్కిన మత్స్యశాఖ అధికారి

**సిద్దిపేట పవర్ తెలంగాణబ్యూరో :** రూ.20 వేలు లంచం తీసుకుంటూ నల్గొండ జిల్లా మత్స్యశాఖ అధికారిణి చరితా రెడ్డి అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీలో నూతన సభ్యులను చేర్చుకునేందుకు వీలుగా అనుమతిచ్చేందుకు ఆమె లంచం డిమాండ్ చేశారు. ఈ క్రమంలో లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్గా ఏసీబీ అధికారులకు చిక్కారు. నగదును రికవరీ చేసుకున్న పోలీసులు, ఆమెపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్ వనస్థలిపురంలోని ఆమె నివాసంలో కూడా సోదాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం



నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నారు.

# ఎప్పుడూ రాజకీయాలే కాదు.. మానవత్వం కూడా అవసరం

**సిద్దిపేట పవర్ తెలంగాణబ్యూరో:** ప్రజలకు సమస్యలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వంతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికోరారు. వరదల కారణంగా నష్టపోయిన కామారెడ్డి జిల్లాలో తీసుకునే చర్యలు సంక్షోభ నివారణలో ఒక మోడల్ జిల్లాగా నిలవాలని అన్నారు. సహాయక చర్యలకు సంబంధించి అధికారులు పరిష్కారాలతో అంచనాలు సిద్ధం చేయాలని చెప్పారు. వారి అంచనాల ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, 15 రోజుల తర్వాత మరోసారి పరిస్థితులను సమీక్షిస్తామని చెప్పారు. వరదల వల్ల దెబ్బతిన్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ప్రజలను ఆదుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై అదికారులకు పలు సూచనలు చేశారు. ఇలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమని నొక్కి చెప్పారు. వరదలొచ్చినప్పుడు దాని ప్రభావం, పర్యవసనాలు నీటి పారుదల, వ్యవసాయం, విద్యుత్, రోడ్లు భవనాలు, మున్సిపాలిటీ.. ఇలా ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి ఉంటుందని అన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని పలు అంశాలను ఉదహరించారు.




వరదల వల్ల ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జరిగిన నష్టంపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో రోజంతా ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని ఇంచార్జీ మంత్రి ధనసరి సీతక్కకి సూచించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి జరిగిన నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనాలు రూపొందించి, ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు. అధికారుల ప్రతిపాదనలపై తక్షణం నిధులను విడుదల చేసి ప్రజలను ఆదుకుంటామన్నారు. కామారెడ్డిలో గతంలో ఎప్పుడూ లేనంత వర్షం కురవడం, భారీ వరదల సమయంలో ఎమ్మెల్యే, SDRF, ఆయా శాఖల అధికారులు ప్రజలకు సహకరించారని చెబుతూ, ఆపత్కాలంలో సిబ్బంది రోజుకు 24 గంటలు పని చేశారంటూ ముఖ్యమంత్రి వారికి అభినందనలు తెలిపారు. సిబ్బంది బాగా స్పందించినప్పటికీ శాఖల మధ్య కొంత సమన్వయ లోపం కనిపించిందన్నారు.

ఎరువుల విషయంలోనూ క్షేత్రస్థాయిలో గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా చూడాలని, ముఖ్యంగా రైతు వేదికల వద్ద సమావేశాలు ఏర్పాటు చేసి ముందుగానే టోకెన్లు జారీ చేయడం వంటి చర్యలు తీసుకోవాలని చెప్పారు. యూరియా అందుబాటులో ఉన్నా ఒక్కసారిగా ఎక్కువ మంది లైన్లో నిలబెట్టడం ద్వారా చివరన ఉన్న వారు సహనం కోల్పోయే పరిస్థితి ఉత్పన్నమవుతుందని, యూరియాకు సంబంధించి స్థానికంగా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. వరదలొచ్చినప్పుడు ఎదుర్కొనడానికి తక్షణం తాత్కాలిక చర్యలు తీసుకున్నప్పటికీ భవిష్యత్తులో ఇలాంటి సందర్భాలను నివారించడానికి, ప్రణాళికా బద్ధమైన శాశ్వత పరిష్కారాలు ఉండాలన్నారు. విపత్తు సహాయం విషయంలో నిబంధనల మేరకు కేంద్రం నుంచి నిధులు రాబట్టుకోవాలని అధికారులకు చెప్పారు. వరదల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబాలకు ఈ సందర్భంగా పరిహారానికి సంబంధించిన పత్రాలను అందించారు.

# నిమజ్జన యాత్రకు పటిష్ట బందోబస్త్

**సిద్దిపేట సీపీ అనురాధ**

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్: 04సెప్టెంబర్2025:** వినాయక నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట 859 మంది అధికారులు మరియు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. వినాయక శోభాయాత్ర లో డీజేల వినియోగంపై మరియు బాణాసంచా వాడకం పై నిషేధమన్నారు. శాంతియుత ప్రశాంతమైన వాతావరణంలో అంగరంగ వైభవంగా వినాయక శోభయాత్ర నిర్వహించుకోవాలి. సిద్దిపేట జిల్లాలో సెప్టెంబర్ 05, 06 వ తేదీ శుక్రవారం, శనివారంనాడు జరగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమం సందర్భంగా జరిగే శోభయాత్ర రూట్ లు మరియు నిమజ్జన ప్రదేశాలైన సిద్దిపేట పట్టణం కోమటి చెరువు, ఎర్ర చెరువు, గజ్వేల్ పట్టణం పాండవుల చెరువు, ప్రజ్ఞాపూర్ ఊర చెరువు, దుబ్బాక రామసముద్రం చెరువు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చేర్యాల కుడి చెరువుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతోపాటు, పోలీసుపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు. వినాయక శోభయాత్రలో డీజేల వినియోగంతోపాటు బాణాసంచా కాల్చడం పై నిషేధం విధించామన్నారు. అదేవిధంగా నిమజ్జనం కొరకు నిర్వహించే శోభాయాత్రలో పాల్గొనే భక్తులు దేవునిపై భక్తి శ్రద్ధలు భజన కార్యక్రమాలు నిర్వహించుకుంటూ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు శోభయాత్ర జరుగు ప్రదేశాలలో సీసీ కెమెరాల పరివేక్షణలో మరియు నిమజ్జనం ప్రదేశంలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వినాయక మండపాల అన్నిటికీ జియో ట్యాగింగ్ చేయడం జరిగింది. వినాయక శోభయాత్ర ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతుంది జిపిఎస్ సిస్టం ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు యువకులు వినాయక శోభాయాత్రను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్నందున చిన్నపిల్లలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్వేషపూరిత నినాదాలు, ప్రసంగాలు చేయడం లేదా పాటల వినియోగం వంటి చర్యలకు పాల్పడరాదని తెలిపారు. ఇట్టి నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా భక్తి శ్రద్ధలతో, మతసామరస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమ్మజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్లు రెండు రోజులు 05, 06 శుక్రవారం, శనివారం , రాత్రి 7 :00 గంటల నుండి ఉదయం 6:00 గంటల వరకు తొగుట, ఎన్సాన్ పల్లి గ్రామం నుండి వచ్చు వాహనదారులు సిద్దిపేట పట్టణానికి వెళ్లడానికి బైపాస్ కుడివైపు బీజేఆర్ చౌరస్తా నుండి సిద్దిపేట పట్టణానికి వెళ్లాలి. మెదక్, రామాయంపేట దుబ్బాక నుండి సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ అంబేద్కర్ చౌరస్తా సిద్దిపేట టౌన్ కు వచ్చే వాహనాలు సిద్దిపేట బైపాస్ రోడ్, ఎల్లమ్మ టెంపుల్, వేములవాడ కమాన్, నర్సాపూర్ చౌరస్తా, కుంకుమ మిల్లు రాజీవ్ రహదారి మీదుగా వెళ్లాలి. నాగదేవత టెంపుల్ చౌరస్తా నుండి సిద్దిపేట పట్టణానికి వచ్చే వాహనదారులు , ఎల్లమ్మ టెంపుల్, వేములవాడ కమాన్మీదుగా సిద్దిపేట పట్టణానికి చేరుకోవాలి. రాజీవ్ రహదారి హుస్నాబాద్ కరీంనగర్ నుండి వచ్చే వాహనాలు, రంగదాంపల్లి చౌరస్తా నుండి, పొన్నాల వై జంక్షన్, దుద్దెడ టోల్గేట్ మీద నుండి హైదరాబాద్ వెళ్లాలి రంగదాంపల్లి చౌరస్తా నుండి సిద్దిపేట పట్టణంలోకి రావడానికి అనుమతి లేదు. వాహనదారులు పోలీసుల సూచనలు పాటించి ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్ల ద్వారా వెళ్లాలని సూచించారు





# సిద్దిపేట గణేష్ నగర్లో వినాయక మండపాలను సందర్శించిన 26వ వార్డు కౌన్సిలర్ కెమ్మ సారం ప్రవీణ్

**సిద్దిపేట, సిద్దిపేట పవర్, సెప్టెంబర్ 4:** వినాయక చవితి ఉత్సవాలు విశేషంగా కొనసాగుతున్న వేళ సిద్దిపేట పట్టణం గణేష్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథ మండపాలను కౌన్సిలర్ కెమ్మ సారం ప్రవీణ్ మంగళవారం సందర్శించారు. గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన, భక్తులతో కలసి పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.తరువాత నిర్వహించిన గణనాథుడి నిమజ్జన శోభాయాత్రలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కెమ్మసారం ప్రవీణ్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగ సామరస్యానికి, ఐక్యతకు ప్రతీక ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందం, సుఖసంతోషాలు నెలకొని ఉండాలని గణనాథుడిని ప్రార్థిస్తున్నాను పండుగలు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువస్తాయి. సమాజంలో బంధుత్వం, సఖ్యత మరింత బలపడేలా చేస్తాయని అన్నారు.




# హరీష్ అన్నను అవమానిస్తే సహించేది లేదు

**అనంతుల ప్రశాంత్**

**కొండపాక, సెప్టెంబర్ 4(సిద్దిపేట పవర్)**బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై కవిత చేసిన వ్యాఖ్యలు ఉద్యమ కారుల మనసులను గాయపరిచాయని జాగృతి రాష్ట్ర నాయకుడు అనంతుల ప్రశాంత్ అన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా కవిత ఆదేశాల మేరకు తెలంగాణ సాధనలో జాగృతిలో సైనికుడిగా పనిచేశానని తెలిపారు.తనకు ఎలాంటి పదవుల ఆశ లేకుండా పనిచేసినా గుర్తింపు లేకుండా పోయిందని విమర్శించారు. కేవలం స్వప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.ఈ పరిణామంతో జాగృతి నుంచి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై ఉద్యమ నాయకుడు కెసిఆర్ నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీలో కొనసాగుతానని స్పష్టం చేశారు.

# శ్రీరామసేన యూత్ ఆధ్వర్యంలో కుంకుమార్చన

**సిద్దిపేట పవర్, దుబ్బాక, సెప్టెంబర్ 04:** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక 15వ వార్డులో శ్రీ రామసేన యూత్ ఆధ్వర్యంలో గురువారం కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దుబ్బాక ఎస్సై కీర్తి రాజు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, యూత్ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఇసుక టిప్పర్ పట్టివేత

**సిద్దిపేట పవర్, సిద్దిపేట అర్బన్: 04సెప్టెంబర్2025 :** ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్ ను సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చిన్నకోడూర్ పోలీసులు పట్టుకున్నారు. టిప్పర్ నెంబర్ టీస్12యూ ఈ 0644 గల దాని డ్రైవర్, గురువారం ఉదయం తెల్లవారుజామున ఇబ్రహీంనగర్ గ్రామ శివారు ధనలక్ష్మి పెట్రోల్ పంపు రాజీవ్ రహదారి వద్ద టిప్పర్ లో ఎలాంటి ప్రభుత్వ అనుమతి వేబిల్ లేకుండా అక్రమంగా ఇసుక గోదావరిఖని నుండి హైదరాబాద్ తరలిస్తున్నారని నమ్మదగిన సమాచారంపై టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది, చిన్నకోడూరు పోలీసులు వెళ్లి పట్టుకున్నారు. పోలీసులను చూసి టిప్పర్ డ్రైవర్ పారిపోయినాడు. చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, అక్రమ రవాణా చేసిన మరియు పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667445, 8712667446, 8712667447, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

